# హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం పవిత్ర జీవిత ఆధారంగా తౌహీద్ (దైవ ఏకత్వ) విశ్వాసభరిత ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 10.04.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

తమ యజమాని (హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం) అడుగుజాడల్లో నడుస్తూ, దైవ ఏకత్వాన్ని స్థాపించడానికి హజ్రత్ మసీహె మౌఊద్ అలైహిస్సలాం చేసిన ప్రయత్నాలు, ఆయన ఆచరణాత్మక ఆదర్శం, తన అనుచరులకు ఆయన (అ) చేసిన ఉపదేశాలు, వారిని ఏ విధంగా తీర్చి దిద్దేవారనే విషయాలకు సంబంధించిన కొన్ని సంఘటనలను నేను సమర్పిస్తాను.

హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) తరచుగా ఇట్లనేవారు. ఒక వ్యక్తి కుమారుడు మరణించాడు. అతని స్నేహితుడు ఒకరు పరామర్శించడానికి వెళ్ళినప్పుడు, ఆ వ్యక్తి బిగ్గరగా ఏడుస్తూ దేవుడు నాపై పెద్ద అన్యాయం చేశాడని అన్నాడు. అనగా దేవుడు తన హక్కును ఏదో లాక్కున్నాడని అతని ఉద్దేశం. కానీ ఒక దాసుడైన (మనిషి) దేవునిపై కలిగి ఉన్న హక్కు ఏమిటో ఆలోచించవలెను?

మనుషులు ఎల్లప్పుడూ ఒక విషయాన్ని గుర్తుంచుకోవలెను. మనకు లభించిన సంతానమైనా, ఇతర సుఖసంతోషాలైనా కేవలం అల్లాహ్ తఆలా అనుగ్రహం వల్లనే లభించినవి. మనం ఎల్లప్పుడూ అల్లాహ్ తఆలా ముందు వినమ్రంగా తలవంచాలని ఈ స్థితి మనల్ని కోరుతుంది. మన ప్రతి మాటలో, ప్రతి పనిలో అతని ఏకత్వాన్ని చాటిచెప్పవలెను. మనలో కనీస స్థాయిలో కూడా అన్యారాధనపు నీడ పడకూడదు. అల్లాహ్ తఆలా పట్ల మనకు ఏదో హక్కు ఉందని ఎప్పుడూ భావించకూడదు. కొద్దిపాటి ఆరాధన చేసినంత మాత్రాన మన బాధ్యత తీరిపోదు. నిజానికి ఆ ఆరాధనలు మన సొంత ప్రయోజనం కోసమే చేసుకుంటాము.

హజ్రత్ మసీహె మౌఊద్ అలైహిస్సలాం తన కుమారుడు మిర్జా ముబారక్ అహ్మద్‌ను అమితంగా ప్రేమించేవారు. అతని అనారోగ్య సమయంలో ఆయనెంతో శ్రద్ధగా సేవలు చేశారు. ముబారక్ అహ్మద్ గనుక మరణిస్తే హజ్రత్ మసీహె మౌఊద్ అలైహిస్సలాం ఎంతో కృంగిపోతారని హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ (రజి) కూడా భావించేవారు. అయితే ముబారక్ అహ్మద్ మరణించిన వెంటనే హజ్రత్ మసీహె మౌఊద్ అలైహిస్సలాం అత్యంత సహనంతో తన మిత్రులకు ఉత్తరాలు వ్రాయడం ప్రారంభించారు. అందులో ఆయనిలా పేర్కొన్నారు. ముబారక్ అహ్మద్ మరణించాడు. కానీ దీనికి ఎవరూ ఆందోళన చెందకూడదు. ఇది అల్లాహ్ తఆలా చిత్తం, దీనిని మనం ఓపికతో స్వీకరించవలెను. ఆ తర్వాత ఆయన బయటకు వచ్చి చిరునవ్వుతో ప్రసంగిస్తూ ముబారక్ అహ్మద్ గురించి అల్లాహ్

చేసిన దైవవాణి నెరవేరిందని చెప్పారు. ఆయన (అ) రాసిన ఒక పద్యం ఇలా ఉంది:

పిలిచేవాడు (దేవుడు) అందరికంటే ప్రియమైనవాడు,
ఓ మనసా! అతని కోసమే నీ ప్రాణాలను అర్పించు.

సుల్తాన్ అబ్దుల్ హమీద్ ఖాన్ చాలా విషయాలు తప్పుగా ఉండెను. కానీ ఆయన ఒక విషయం హజ్రత్ మసీహె మౌఊద్ (అలైహిస్సలాం)కు ఎంతో ఇష్టముండెను. యుద్ధాన్ని నివారించడం కోసం మంత్రులు వివిధ బలహీనతలను, కష్టాలను వివరించినప్పుడు సుల్తాన్ ఇలా అన్నారు: కొన్ని విషయాలను దేవునికు కూడా వదిలివేయవలెను. ఈ సంఘటన ద్వారా హజ్రత్ మసీహె మౌఊద్ అలైహిస్సలాం అల్లాహ్ తఆలా మీద ఉంచాల్సిన సంపూర్ణ విశ్వాస ప్రాముఖ్యతను కొనియాడారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం తలనొప్పి మరియు కళ్ళు తిరిగే వ్యాధితో బాధపడేవారు. ఒక వైద్యుడికి ఈ వ్యాధిని నయం చేయడంలో ప్రత్యేక నైపుణ్యం ఉందని విని, అతన్ని పిలిపించారు. ఆ వైద్యుడు హజ్రత్ గారిని పరీక్షించి రెండు రోజుల్లో మిమ్మల్ని నయం చేస్తానని అన్నాడు. ఇది విన్న వెంటనే హజ్రత్ గారు లోపలికి వెళ్లిపోయి హజ్రత్ మౌల్వీ నూరుద్దీన్ (రజి) గారికి ఇలా లేఖ రాశారు. ఈ వ్యక్తితో నేను చికిత్స అస్సలు చేయించుకోదలుచుకోలేదు. ఇతను దైవ ప్రకటన చేస్తున్నాడా! ఇతనికి ప్రయాణ ఖర్చులు మరియు అదనంగా 25 రూపాయలు ఇచ్చి పంపించివేయండి.

హజ్రత్ మసీహె మౌఊద్ అలైహిస్సలాం ఇట్లనేవారు: అల్లాహ్ వైభవం మరియు గౌరవం పట్ల ఉత్సాహం పట్టుదల కలిగి ఉన్నవారినే దేవుడు ప్రేమిస్తాడు. అటువంటి వారు ఒక సూక్ష్మమైన మార్గంలో ప్రయాణిస్తారు, దైవప్రేమ పట్ల ఉత్సాహం లేనివారెవరూ వారితో నడవలేరు. మనిషి తన మనసులో అల్లాహ్ తఆలా పట్ల వ్యక్తిగతమైన ఉత్సాహం కలిగి ఉండనంత వరకు, తన స్వార్థం, ప్రాపంచిక ప్రయోజనాల నుండి విముక్తి పొందనంత వరకు, అతని ఆరాధనలు లేదా దానధర్మాలు అంగీకరించబడవు.

హుజూర్ అలైహిస్సలాం ఇట్లు ప్రవచించారు. ప్రార్థన అంగీకరించబడాలంటే దైవ ఏకత్వం పట్ల సంపూర్ణ విశ్వాసముండవలెను. అల్లాహ్ ప్రేమను పొందడమే అన్ని ప్రార్థనల కంటే ప్రాధాన్యత కలిగి ఉండవలెను. మేము చాలా ప్రార్థనలు చేశాము, నఫిల్ నమాజులు చదివాము, దానములు చేశాము, అయినా మా ప్రార్థనలు అంగీకరించబడలేదని ఫిర్యాదు చేసేవారు ఈ విషయాన్ని గమనించ వలెను. ఈ మార్గాన్ని హజ్రత్ మసీహె మౌఊద్ (అలైహిస్సలాం) సూచించారు.

హజ్రత్ మసీహె మౌఊద్ అలైహిస్సలాంను ఉద్దేశించి అల్లాహ్ తఆలా ఇట్లన్నాడు. ఈ కాలంలో నీవు నా ఏకత్వానికి ప్రతినిధిగా ఉన్నావు. ప్రపంచంలో కనుమరుగైన తౌహీద్‌ను తిరిగి స్థాపిస్తున్నావు. అందుకే ఓ ముహమ్మదీయ మసీహ్! నా ఏకత్వం నాకు ఎంత ప్రియమైనదో నీవు కూడా నాకు అంతటి ప్రియమైనవాడవు. క్రైస్తవులు తమ మసీహ్‌ని అబద్ధం, కుట్రతో దైవ కుమారునిగా చేసుకున్నారు. కావున దైవ ప్రవక్త (హజ్రత్) ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) శిష్యులు కూడా దైవ సన్నిధిలో దైవ బిడ్డల వంటి ప్రియమైన స్థాయిని పొందగలరని లోకానికి చాటి చెప్పడానికి నా ఆత్మగౌరవం నీపై కుమారులైన హక్కు వలె అపారమైన ప్రేమను కురిపిస్తోంది.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఐరోపా అయినా లేదా ఆసియా అయినా ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న సత్య ఆత్మలన్నింటినీ అల్లాహ్ తఆలా తన ఏకత్వం వైపు ఆకర్షించాలని మరియు తన సేవకులందరినీ ఒకే ధర్మంపై చేర్చాలని కోరుకుంటున్నాడు. ఇదే దైవ లక్ష్యం. దీని కోసమే నేను ఈ లోకానికి పంపబడ్డాను. కనుక మీరు ఈ లక్ష్యాన్ని అనుసరించండి, అయితే అది కేవలం మృదుత్వం, ఉత్తమ నైతికత, ప్రార్థనల ద్వారా మాత్రమే జరగవలెను.

ఆయనింకా ఇలా అన్నారు. నా అసలు ఉద్దేశం మరియు నా నియామకం వెనుక ఉన్న ముఖ్య లక్ష్యం దైవ ఏకత్వాన్ని మరియు దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గౌరవాన్ని ఈ ప్రపంచంలో స్థాపించడమే, నా ఆనందమంతా దీనిలోనే ఉంది.

మరొక సందర్భంలో ఆయనిట్లనిరి. నా వద్ద బైఅత్ (ప్రతిజ్ఞ) చేయడంలోని అసలు ఉద్దేశం కూడా దైవ ఏకత్వాన్ని మరియు పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గౌరవాన్ని ప్రపంచంలో నిలబెట్టడమే. ఖాదియాన్‌లో హజ్రత్ మసీహె మౌఊద్ అలైహిస్సలాం వద్ద 'పీరా దత్తా' అనే సేవకుడు ఉండేవారు. అందరూ అతడిని అదే పేరుతో పిలిచేవారు. కానీ హజ్రత్ గారు మాత్రం అతడిని పిలిచే టప్పుడు 'పీరీ దత్తా' (అంటే నా అల్లాహ్ ప్రసాదించిన వ్యక్తి) అని గౌరవంగా సంబోధించేవారు.

అల్లాహ్ తఆలా హజ్రత్ గారిని దైవవాణి ద్వారా ఇట్లు ఆజ్ఞాపించెను. خذو التوحید التوحید یا ابناء الفارس: "ఖుజుత్తౌహీద అత్తౌహీద యా అబ్నాఅల్ ఫారిస్" అనగా ఓ పారశీక పుత్రులారా! దైవ ఏకత్వాన్ని గట్టిగా పట్టుకోండి, దైవ ఏకత్వాన్ని గట్టిగా పట్టుకోండి. ఈ దైవవాణి ఆయన వంశీయులకే కాక, ఆయనను అనుసరించే ప్రతి ఒక్కరి అభివృద్ధికి మరియు మనుగడకు మూలాధారం. మీరు ఆయన బైఅత్‌లోకి వచ్చినప్పుడు, మీరు కూడా ఆయన ఆధ్యాత్మిక సంతానంగా మారతారు. ఈ దైవ ఏకత్వ సందేశాన్ని గట్టిగా పట్టుకున్నప్పుడే ఇహ,పరలోకంలో విజయం లభిస్తుంది. లేనిచో కేవలం రక్త సంబంధం లేదా కేవలం బైఅత్ చేయడం కానీ ఎటువంటి ప్రయోజనాన్ని చేకూర్చవు. దేవునితో సమానంగా ఏ మనిషికైనా అధిక గౌరవం ఇవ్వడాన్ని హజ్రత్ మసీహె మౌఊద్ అలైహిస్సలాం తీవ్రంగా అసహ్యించు కునేవారు. అందుకే కరచాలనం చేసే సమయంలో తన పాదాలను తాకవద్దని ఆయన (అ) తన అనుచరులను మరియు సందర్శకులను అనేకసార్లు కఠినంగా వారించారు.

హజ్రత్ మసీహె మౌఊద్ అలైహిస్సలాం ఇట్లు ప్రవచించారు. ఎవరైనా నా ఫోటో తీయడాన్ని లేదా విగ్రహారాధకుల వలె దానిని తమ వద్ద ఉంచుకోవడాన్ని లేదా ప్రచురించడాన్ని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. ఎవరైనా అలా చేయాలని నేను ఎన్నడూ ఆజ్ఞాపించలేదు. విగ్రహారాధనను మరియు చిత్రపటాల ఆరాధనను నాకంటే ఎక్కువగా ద్వేషించేవారు మరొకరు ఉండరు. అయితే ఈ రోజుల్లో ఐరోపా ప్రజలు ఎవరి రచనలనైనా చదవాలనుకున్నప్పుడు, ముందుగా వారి ఫోటోను చూడాలని ఆశిస్తున్నట్లు నేను గమనించాను. ఎందుకంటే ఐరోపా దేశాల్లో 'ముఖ సాముద్రిక శాస్త్రం' బాగా అభివృద్ధి చెందింది. కేవలం ఒక వ్యక్తి ముఖాన్ని చూడటం ద్వారానే అతను సత్యవంతుడా లేక అబద్ధాలకోరా అని వారు గుర్తించగలరు. వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ ప్రజలు నా వద్దకు చేరుకోలేరు, నా ముఖాన్ని నేరుగా చూడలేరు. అందుకే అక్కడి విద్వాంసులు నా ఫోటో ద్వారా నా అంతరంగాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఐరోపా మరియు అమెరికా నుండి చాలామంది నాకు లేఖలు రాస్తూ ఇలా పేర్కొన్నారు. మేము మీ ఫోటోను నిశితంగా పరిశీలించాము. ముఖ సాముద్రిక శాస్త్రం ప్రకారం ఈ చిత్రం ఉన్న వ్యక్తి ఖచ్చితంగా అబద్ధాలకోరు కాదని మేము నమ్ముతున్నాము. అమెరికాకు చెందిన ఒక మహిళ నా ఫోటోను చూసి ఇది యేసు అనగా ఈసా అలైహిస్సలాం చిత్రం వలె ఉందని అన్నది. కనుక ఈ ఉద్దేశం తో మరియు ఈ పరిమితి వరకు మాత్రమే నేను ఈ పద్ధతిని కొనసాగించుటకు దీని ప్రయోజనం వలన మౌనం వహించాను. ఫోటోలు మరియు చిత్రాల ద్వారా విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది. జంతువులను గుర్తించడంలో లేదా వ్యాధులను కనిపెట్టడంలో ఇవి సహాయపడుతున్నాయి, కాబట్టి వాటిని నిషిద్ధం అనడం సరికాదు. ఇస్లాం కేవలం అన్యారాధనను లేదా అనవసరమైన పనులకు దారితీసే విషయాలనే నిషేధిస్తుంది. జ్ఞానానికి, ప్రయోజనానికి మూలమైన వాటిని కాదు. అయితే చిత్రపటాలు అనేవి మంచి

ఉద్దేశంతో మాత్రమే ఉండవలెను. వాటిని జీవనోపాధిగా లేదా అనవసరమైన ప్రచార సాధనంగా మార్చుకోకూడదు. ఎందుకంటే అలా చేయడం వల్ల కాలక్రమేణా మూఢనమ్మకాలు, అన్యాధాన పుట్టే అవకాశముంటుంది. అందుకే జాగ్రత్త మరియు నిగ్రహం చాలా అవసరం. اِنَّمَا الْاَعْمَالُ بِالنِّيَّاتِ అనగా నిశ్చయంగా కర్మల ఫలితాలు ఉద్దేశాలపై ఆధారపడి ఉంటాయి.

హుజూర్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఇటువంటి మూఢనమ్మకాలు మన ప్రజలలో కూడా మొదలవుతున్నాయి. కొంతమంది తమ మరణించిన పెద్దల చిత్రపటాలను తమతో పాటు ఉంచుకుంటున్నారు. పెళ్లి వేడుకలలో చనిపోయిన పెద్దల ఫోటోలను పెద్ద ఫ్రేమ్ కట్టించి పెట్టి వీరు మన పెద్దలు, వీరు కూడా మన వేడుకలో పాల్గొంటున్నారని భావిస్తున్నారు. ఇవన్నీ అన్యారాధనపు విషయాలు మరియు మూఢనమ్మకాలు. వీటి నుండి దూరంగా ఉండవలెను. కేవలం జ్ఞాపకం కోసం అల్బమ్‌లలో ఫోటోలు ఉంచు కోవడం సమ్మతమే. కానీ దానిని ఒక అలవాటుగా మార్చుకుని, ప్రతిరోజూ ఉదయాన్నే వాటిని చూడటం, వాటికి సలాం చేయడం వంటివి చేయడం ఖచ్చితంగా తప్పే.

హజ్రత్ మౌలానా గులాం రసూల్ రాజేకీ (రజి) 1901 నాటి ఒక సంఘటనను ఇలా వివరించారు. నేను హజ్రత్ మసీహె మౌఊద్ అలైహిస్సలాం గారి సన్నిధిలో ఉన్నాను. అప్పుడు ఆయన దైవ ఏకత్వం గురించి ప్రసంగిస్తూ ఇట్లన్నారు. కొంతమంది ఎవరైనా మేలు చేసినప్పుడు అల్హాందులిల్లాహ్ (సర్వప్రశంసలు అల్లాహ్‌కే) అనకుండానే నేరుగా జజాకల్లాహ్ (అల్లాహ్ మీకు ప్రతిఫలం ఇచ్చుగాక) అని అంటారు. లోతుగా ఆలోచిస్తే దీనిలో కూడా ఒక రకమైన అన్యారాధన దాగి ఉంది. ఎందుకంటే ఉపకారం చేసే శక్తిని ఇచ్చేది అల్లాహ్ తఆలా మాత్రమే. కావున మొదట అల్లాహ్‌ను స్తుతించి ఆ తర్వాత ఉపకారం చేసిన వ్యక్తికి కృతజ్ఞతలు తెలుపవలెను.

హుజూర్ (అ) గారి చివరి లాహోర్ ప్రయాణం గురించి హజ్రత్ భాయి అబ్దుర్రహ్మాన్ ఖాదియానీ (రజి) వ్రాస్తూ ఇలా పేర్కొన్నారు. మరణానికి కొన్ని రోజుల ముందు కొంతమంది మహిళలు హజ్రత్ గారిని దర్శించుకోవడానికి వచ్చారు. హజ్రత్ గారు చాలా నిమగ్నమై ఉన్నప్పటికీ, ఏదైనా ఉపదేశం చేయమని వారు కోరారు. ఆయన (అ) వారి విన్నపాన్ని మన్నించి దైవ ఏకత్వం గురించి బోధిస్తూ, విగ్రహారాధనను నివారించమని చెప్పారు. మరొక ప్రసంగంలో ఆయనిట్లనిరి. ఈసా మసీహ్‌ను మరణించనివ్వండి (అంటే ఆయన దైవత్వం అనే అబద్ధపు నమ్మకాన్ని వీడండి) దీనిలోనే ఇస్లాం జీవం ఉంది. మసీహ్ ముహమ్మదీని రానివ్వండి దీనిలోనే ఇస్లాం గొప్పతనముంది.

కావున తౌహీద్ సందేశాన్ని ఇతరులకు అందించడానికి, దానిని మన జీవితాల్లో భాగం చేసుకోవడానికి గట్టి ప్రయత్నం చేయవలెను. నేడు మసీహ్ ముహమ్మదీ సేవకులు చేయాల్సిన పని ఇదే. అల్లాహ్ తఆలా మనందరికీ ఈ బాధ్యతను నెరవేర్చుటకు అనుగ్రహించుగాక. (ఆమీన్)

ఖుత్బా ముగింపులో హుజూరె అన్వర్ ప్రపంచ ప్రస్తుత పరిస్థితులు మరియు ముస్లిం సమాజ క్షేమం కోసం ప్రార్థించగలరని పిలుపునిచ్చారు.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ
اَعْمَالِنَا۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ۔ وَنَشْهَدُ أَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ
وَرَسُوْلُهٗ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ
وَالْبَغْيِ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔